
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 5 । మే । 2023



అచ్చమైన స్వచ్ఛంద సేవకులు

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను ఇంటింటా అందిస్తూ వారి సంక్షేమాన్ని కాంక్షిస్తున్న ప్రభుత్వ లక్ష్యాన్ని నూరుశాతం నెరవేర్చడానికి గ్రామ/వార్డు వలంటీర్లు కృషి చేస్తున్నారు. - IIలో▶



వనములలో విహరించె సత్యదేవుడు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు నవదంపతులు సత్యదేవుడు, అమ్మవార్లకు వన విహారోత్సవం ఘనంగా నిర్వహించారు. - IIలో▶

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా రాహుల్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ గురువారం రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన రాజారావు నెల్లూరులోని జైలు శిక్షణాలయానికి వెళ్లనున్నారు.

మా బాబే.. వరిశీలిస్తారట!



ఉప్పలగుప్తం మండలం వాడపర్రులో మిల్లులకు ఎగుమతి అవుతున్న రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం



అన్నదాతలకు ఉపాధి కూలీల సాయం



- నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటన
- టీడీపీ పాలనలో రైతులకు అరకొర పరిహారం
- నీలం తుపాను సాయం రూ.ఐదు కోట్లు ఎగవేత
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట నష్టపోయిన సీజన్‌లోనే పరిహారం
- ఉపాధి కూలీలతో అన్నదాతలకు సాయం

సాక్షి అమలాపురం: 'వ్యవసాయం దండగ' అన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరిచేలను పరిశీలించేందుకు వస్తున్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పంట నష్టపోయిన రైతులకు ఒక పద్ధతి అంటూ లేకుండా విపరీతమైన జాప్యం చేసి పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇచ్చిన చంద్రబాబు రైతులను తక్షణం ఆదుకోవాలంటూ ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండడం గమనార్హం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట చేలను చంద్రబాబు శుక్రవారం పరిశీలించనున్నారు. నష్టపరిహారం సకాలంలో ఇవ్వకుండా తన పాలనలో రైతులను పరిహాసమాడిన బాబు నేడు తగుదునమ్మా అంటూ పరిశీలనకు రావడంపై అన్నదాతలు ముక్కున వేలేసుకుంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట, తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కడియంలో ఆయన వరిచేలను పరిశీలించనున్నారు. విభజన తరువాత చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు. ఇచ్చిన అరకొర పరిహారం కూడా సాంకేతిక కారణాలు, ఇతర సాకులు చూపి కోత పెట్టేవారు. ఆయన ఐదేళ్ల పాలనలో కేవలం 15,169 మంది రైతులకు చెందిన 16,635 ఎకరాలకు గాను రూ.9.38 కోట్లను పరిహారంగా అందించారు. ఉమ్మడి రాష్ట్రం విభజన సమయంలో సాంకేతిక కారణాలతో ఆగిపోయిన నీలం పరిహారం రూ.ఐదు కోట్లను మాత్రం జిల్లా రైతులకు ఇవ్వలేదు.

రెండు నెలల్లో వరద పరిహారం

గత ఏడాది జూలై నుంచి సెప్టెంబరు నెల వరకు గోదావరికి వరుసగా మూడుసార్లు వరద వచ్చింది. అదే ఏడాది నవంబరు నెలలో ఉద్యాన పంటలకు సంబంధించి 14 మండలాల్లో 4,963 హెక్టార్లలో సుమారు 14,885 మంది రైతులకు రూ.10,79,23,353 పెట్టుబడి రాయితీగా అందించారు. 437 మంది రైతులకు చెందిన 191.53 హెక్టార్లలో వరి పంట దెబ్బతినగా వారికి రూ.28.72 లక్షలు అందించారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014 నుంచి 19 వరకు)

సంభవించిన సంవత్సరం	ప్రకృతి వైపరీత్యం	పరిహారం అందిన నెల
2014 అక్టోబరు	హుదూద్ తుపాన్	2104 డిసెంబరు (రెండు నెలలు)
2016 సెప్టెంబరు	భారీ వర్షాలు	2017 ఆగస్టు (11 నెలలు)
2017 సెప్టెంబరు	భారీ వర్షాలు	2018 సెప్టెంబరు (12 నెలలు)
2018 మార్చి- ఏప్రిల్	అకాల వర్షాలు	2018 ఆగస్టు (నాలుగు నెలలు)
2018 ఆగస్టు	భారీ వర్షాలు, వరదలు	2019 జనవరి (ఐదు నెలలు)

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత (2019 నుంచి)

సంభవించిన సంవత్సరం	ప్రకృతి వైపరీత్యం	పరిహారం అందిన నెల
2020 సెప్టెంబరు	వరదలు, భారీ వర్షాలు	27-10-2020 (నెల రోజులు)
2020 అక్టోబరు	వరదలు, భారీ వర్షాలు	17-11-2020 (నెల రోజులు)
2022 జూలై నుంచి సెప్టెంబరు	భారీ వరదలు, వర్షాలు	28-11-20202 (రెండు నెలలు)

రైతులను ఆదుకునేందుకు.. ఉపాధి దన్ను

భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించింది. రైతులకు చేదోడుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీట మునిగిన పనులు ఒబ్బిడి చేయడం, ధాన్యం రాశులు, చేలల్లో ఉన్న నీరు దిగేలా బోదెలు వేయించడం చేసింది. గత మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 1,03,000 మంది ఉపాధి కూలీలు ఈ పనుల్లో పాల్గొన్నారు. మరోవైపు తడిసిన, రాశుల వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని ఆగమేఘాలపై కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ వరకు 33,192.760 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, రెండో తేదీన 2,354.84 ఎం.టీలు, మూడో తేదీన 1,573.6 ఎం.టీలు, నాలుగో తేదీన 1,931.2 ఎం.టీల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి సేకరించారు.

ఈ విధానం చాలా బాగుంది



గత ఏడాది జూలై నుంచి సెప్టెంబరు వరకు గోదావరికి వరుసగా వరదలు వచ్చాయి. 4.90 ఎకరాల్లో అరటి దెబ్బతింది. నాకు రూ.30 వేల పరిహారం వచ్చింది. దీనివల్ల మొత్తం నష్టం తీరకున్నా పంట పోయిన రెండు నెలలకు పరిహారం ఇవ్వడం వల్ల రైతులందరం త్వరగా కోలుకున్నాం. – బందారు శ్రీనివాసరావు, ఉద్యాన రైతు, వానపల్లి, కొత్తపేట మండలం.

పంటకాలంలోనే పరిహారం



ఖరీఫ్‌లో పంట నష్టపోతే ఖరీఫ్ పూర్తయ్యే నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోంది. సమయానికి ఆదుకునే పరిస్థితి టీడీపీ ప్రభుత్వ హయాంలో లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆగమేఘాలపై ధాన్యం స్వయంగా కొనుగోలు చేస్తోంది. – జిన్నూరి రామారావు (బాబి), ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు, డి.రావులపాలెం, అల్లవరం మండలం

రైతులూ ధైర్యంగా ఉండండి

- భరోసా ఇచ్చిన మంత్రి వేణుగోపాలకృష్ణ
- జిల్లా జాయింట్ కలెక్టర్‌తో కలసి క్షేత్రస్థాయి పరిశీలన



తాళ్లపొలంలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న మంత్రి వేణు, జేసీ ధ్యానచంద్ర

రామచంద్రపురం రూరల్: అకాల వర్షాలతో ధాన్యం తడిసినా, పంటలు నీట మునిగినా రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి మండలంలోని తాళ్లపొలం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న ధాన్యంపై క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి ఆశాజనకంగా పండినా, అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఎక్కడైతే ధాన్యం రాశులు తడిసిపోయాయో అక్కడ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెంటనే ఉప్పు నీళ్లతో పిచికారీ చేయించామన్నారు. పంట పొలాల్లో వర్షం నీరు చేరిన చోట్ల నీరు తోడే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్బీకేల ద్వారా ప్రతీ ధాన్యపు గింజను కొనడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాలోని రెవెన్యూ అధికారులందరికీ తడిసిన ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలిచ్చామన్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా అధికారులను కలసి తెలియజేస్తే త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.సింధుసుబ్రహ్మణ్యం, ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు, ఏఓ ఎన్.సత్యప్రసాద్, ఎంపీపీ అంబటి భవాని, గ్రామ సర్పంచ్‌లు కట్టా గోవిందు, అనిశెట్టి రామకృష్ణ, కొత్తపల్లి అరుణ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రైతుల కోసం అంటూ.. రాజకీయాలకే తొలి ప్రాధాన్యం..

చంద్రబాబు పర్యటనలో నియోజకవర్గాల సమీక్ష



బస్సు దిగి నియోజకవర్గాల సమీక్షకు వెళుతున్న చంద్రబాబునాయుడు

రామచంద్రపురం: పంట నష్టపోయిన రైతులను కలవడానికి అంటూ ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి రామచంద్రపురం పట్టణానికి విచ్చేశారు. అయితే ఆయన రాజకీయాలకే తొలి ప్రాధాన్యత ఇస్తూ..ముందుగా నిర్ణయించుకున్న మేరకు పట్టణంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నియోజకవర్గాల ఇన్‌చార్జులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మీడియాకు సైతం అవకాశం ఇవ్వలేదు.

నేడు వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా సొమ్ము జమ

సాక్షి అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా లబ్ధిదారులకు ప్రోత్సాహకం శుక్రవారం జమ కానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ, మైనార్టీ, ఈబీసీలలో పేదవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. జిల్లాలో అర్హత ఉన్న సుమారు 754 మంది లబ్ధిదారులకు రూ.5,48,55,000 అందించనున్నారు. బీసీలలో ఇతర సామాజికవర్గాలకు చెందినవారిని వివాహం చేసుకున్న 15 మంది, సొంత సామాజికవర్గానికి చెందిన వారిని పెళ్లాడిన 408 మందికి రూ.2,15,25,000 అందనుంది. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి 11 మందికి రూ.4,40,000, ప్రత్యేక ప్రతిభావంతుల విభాగంలో 11 మందికి రూ.16.50 లక్షలు, మైనార్టీలు ఇద్దరికి రూ.రెండు లక్షలు ఇవ్వనుంది. ఎస్సీలలో ఇతర సామాజికవర్గం వారిని వివాహం చేసుకున్న 16 మందికి, సొంత సామాజికవర్గంలో వివాహం చేసుకున్న 287 మందికి కలిపి రూ.3,06,20,000, ఎస్టీలలో ఇతర ఇతర సామాజికవర్గానికి చెందిన వారిని వివాహం చేసుకున్న ఒకరికి, సొంత సామాజిక వర్గవారిని వివాహం చేసుకున్న ముగ్గురికి కలిసి రూ.4,20,000 లబ్ధి చేకూరనుంది.

6న కేఆర్‌ఎస్‌ఎస్ అవగాహన సదస్సు

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అంబాజీపేటలోని కోస్రా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో కోనసీమ రైలు అంశంపై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అతిథిగా పాల్గొనే ఈ సదస్సులో కోనసీమలో రైలు పరుగులు ఆకాంక్షించే వారంతా హాజరు కావాలని ఆ సదస్సు ఆహ్వాన సంఘం ప్రతినిధులు అరిగెల బలరామమూర్తి, మేడిద శ్రీను పిలుపునిచ్చారు. ఈ మేరకు వీరు అమలాపురంలో గురువారం ప్రకటన విడుదల చేశారు.

ఎస్పీ కార్యాలయం వద్ద మహిళల ధర్నా

అమలాపురం టౌన్: గ్రామంలో ఓ పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ రాయవరం మండలం పసలపూడికి చెందిన కొందరు మహిళలు అమలాపురం ఎస్పీ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ధర్నా చేశారు. అన్యాయం జరిగిందని పోలీసు స్టేషన్‌కు వెళితే మాపైనే రాయవరం ఎస్సై కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. తమను వేధిస్తున్న కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని, రాయవరం ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండు చేస్తూ ఆ మహిళలు ఎస్పీ కార్యాయంలో ఏఎస్పీ లతామాధురికి ఫిర్యాదు చేశారు.

జగనన్న విద్యాకానుక సక్రమ పంపిణీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న విద్యాకానుక పంపిణీ సక్రమంగా చేయాలని ఆర్జేడీ జి.నాగమణి కోరారు. సర్వశిక్షా అభియాన్ మందిరంలో మండల స్థాయి మోనటరింగ్ సభ్యులకు గురువారం సమీక్ష నిర్వహించారు. పాఠ్యపుస్తకాలు భద్రత విషయంలో జాగ్రత్త వహించాలని,వర్షాలు వస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖంగా చెదలు పట్టకుండా చూడాలని సూచించారు. శాంపిల్‌గా వచ్చిన జగనన్న విద్యాకానుక కిట్‌లను మండలాల వారీగా పంపిణీచేశామన్నారు. సమావేశంలో డీఇఓ అన్నపూర్ణ,డీవైఇఓ సుభద్ర,ఆర్‌జేడీ రాజు, 21 మండలాల విద్యాశాఖాధికారులు,ఏపీఎంలు,సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి రోగీ సంతృప్తి పడేలా వైద్య సేవలు

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు
- అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సందర్శన



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇటీవల కాలంలో వైద్యపరంగానే కాకుండా మౌలిక సదుపాయాలు కూడా బాగా అభివృద్ధి చెందిన క్రమంలో ప్రతీ రోగి సంతృప్తి పడేలా సేవలు అందించాలని రాష్ట వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు వైద్యులకు సూచించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన బుధవారం రాత్రి సందర్శించి వైద్యులతో చర్చించారు. తొలుత కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు ఆస్పత్రి వద్ద జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీరాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ సుప్రియ తదితర వైద్యులు, సిబ్బంది స్వాగతం పలికారు. కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఓపీ, ఇన్ పేషెంట్ల వివరాలపై ఆరా తీశారు. రోగులతో ఆయన స్వయంగా మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్య సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నాడు- నేడు పథకం కింద ఆస్పత్రి భవనాలకు జరుగుతున్న మరమ్మతులు, పలు నిర్మాణ పనుల ప్రగతిపై చర్చించారు. ఈ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు ఆధ్వర్యంలో వైద్యులు కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్‌ఐ మెషీన్ అవసరమని, మహా ప్రస్థానం వెహికల్ ఏర్పాటు చేయాలని కోరారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలను రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

వేసవిలో సృజనకు పదును

- 8 నుంచి గ్రంథాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలు
- 6-10 తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా..

అమలాపురం టౌన్: వేసవి సెలవులను విద్యార్థులు పూర్తిగా వినోదాలు, విహార యాత్రలకే కేటాయించకుండా వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేందుకు గ్రంథాలయాలు వేదికలు కానున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకూ 32 రోజులపాటు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. కొన్ని శాఖల మాదిరిగానే జిల్లా గ్రంథాలయ సంస్థ ఉమ్మడి జిల్లా స్థాయిలోనే మూడు జిల్లాల పరిధితో పనిచేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఐదు ప్రథమ శ్రేణి గ్రంథాలయాలు, 10 గ్రేడ్-2 గ్రంథాలయాలు, 86 గ్రేడ్-3 గ్రంథాలయాలు, గ్రామీణ గ్రంథాలయాలు, 135 పుస్తక నిక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయాలకు 20,26,321 మంది పాఠకులు ఉండగా 89,987 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఈ గ్రంథాలయాల్లో 14,54,930 పుస్తకాల ఉంటే అందులో 90 వేల పుస్తకాలు కంప్యూటరైజ్ చేశారు.

పలు అంశాల్లో తర్ఫీదు

గ్రంథాలయాల్లో ఆరో తరగతి నుంచి 10 తరగతి చదివే విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆయా రంగాల్లో నిపుణులతో అంశాల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, సంస్థ కార్యదర్శి వీఎల్‌ఎన్‌ఎస్‌వీ ప్రసాద్ జిల్లాలో 32 రోజుల పాటు జరగనున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. రోజూ వారీగా ఏఏ సమయాల్లో ఏఏ అంశాలపై శిక్షణ ఉంటుందో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇప్పటికే ఓ టైమ్ టేబుల్‌ను ప్రకటించింది. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయాలకు పంపించి ఉచిత వేసవి శిక్షణ శిబిరాల ద్వారా వారిలో పఠనాశక్తిని పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ విజ్ఞప్తి చేస్తోంది.

వేసవి శిక్షణ ఇలా..

- ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకూ కథలు వినడం
- ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకూ వివిధ రకాల పుస్తకాల పఠనం (ఐ లవ్ రీడింగ్)
- ఉదయం 10 నుంచి 10.10 గంటల వరకూ విరామం
- ఉదయం 10.10 గంటల నుంచి 10.30 గంటల వరకూ కథలు చెప్పడం, వినడం
- ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గేమ్స్, డ్యాన్స్, చెస్‌లో తర్ఫీదు



అమలాపురం గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు (ఫైల్)

అన్నదాతకు వెన్నుదన్ను

- క్షేత్ర స్థాయిలో రైతులకు అండగా నిలిచిన అధికార గణం
- పంట రక్షణకు దోహదపడిన ఆర్బీకే, సచివాలయ వ్యవస్థలు
- చినుకుపడగానే స్పందించి అవసరమైన సాయం
- కొనసాగుతున్న పంట రక్షణ చర్యలు

కపిలేశ్వరపురం: ప్రకృతి ప్రకోపానికి తరచూ జన జీవనం, వ్యవసాయం, వ్యవస్థలు స్తంభిస్తుంటాయి. రబీ పంట చేతికందనున్న సమయంలో గత నెల 23న రెండు రోజులు, ఈ నెల ఒకటో తేదీ నుంచి వర్షాలు కరుస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో చేతికందనున్న పంటకు అకాల వర్షాలు సమస్యగా మారడంతో ప్రభుత్వం పంట రక్షణ చర్యలను సకాలంలో చేపట్టింది. ఈ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటైన ఆర్బీకే, సచివాలయ వ్యవస్థలు అందుకు విశేషంగా దోహదపడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో ఐదారుగురితో మాత్రమే వ్యవసాయ శాఖ ఉద్యోగుల కార్యకలాపాలుండేవి. పంట దెబ్బతిన్న తర్వాత నష్టం అంచనా వేయడానికే ఆనాడు వారు పరిమితమయ్యేవారు. నేడు గ్రామంలో ఒకటి నుంచి రెండు ఆర్బీకే, సచివాలయాలు ఏర్పాటయ్యాయి.




ఈనెల 2న వెదురుమూడిలో తడిసిన ధాన్యాన్ని రైతులు కోరిన చోటకు తరలిస్తున్న ఉపాధి కూలీలు ఉద్యోగులకు తోడు ఉపాధి కూలీల అండ

జిల్లాలో 515 సచివాలయాల్లో 4,528 మంది సచివాలయ ఉద్యోగులున్నారు. 250 క్లస్టర్లు పరిధిలో 389 ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులున్నారు. వారికితోడు వీఆర్వోలు, ఇతర ఉద్యోగులు రైతుకు వెన్నంటి నిలిచారు. చినుకులు పడుతున్నప్పుడు రైతుకు తోడుగా బరకాలను కప్పుతూ సహాయ పడటం జిల్లాలో అనేక చోట్ల కనిపించింది. తడిసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడంలోనూ, చేలో నీరు బయటకు పంపేందుకు బోదెలు వేయడంలోనూ ఉపాధి కూలీల సాయం తీసుకోవాలంటూ ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు వెంటనే అమలులోకి రావడంతో తమ పంటను రక్షించుకోగలిగామంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి వ్యవసాయ క్షేత్రంలో ముంపులో ఉండిపోయిన ధాన్యాన్ని ఉపాధి కూలీలు రహదారిపైకి తెచ్చి రైతులకు అప్పగించారు. విపత్తువేళ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంలోనూ ప్రభుత్వం చాకచక్యంగా వ్యవహరించిందని రైతులంటున్నారు. దెబ్బతిన్న ధాన్యంపై ఉప్పు ద్రావణాన్ని చల్లుకోండంటూ సూచన చేసి ఊరుకోకుండా ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేసేందుకు రైతుల నుంచి జిల్లాలో సుమారు 1,769 స్ప్రేయింగ్ మెషీన్లను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో ఈ దాళ్వా సీజన్‌లో 1.72 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేయగా ఇప్పటి వరకూ 77 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. 250 క్లస్టర్ల పరిధిలో 389 ఆర్బీకేల ద్వారా 166 వ్యవసాయ సహకార సంఘాల సాయంతో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలన్నది లక్ష్యం. వాతావరణశాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో వర్షాలు మరి కొద్దిరోజులు పడే అవకాశాలున్నందున ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వ భవనాల్లోకి, గొడౌన్లలోకి చేర్చుకునే వెసులుబాటు రైతులకు కల్పించాలంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు.



పడమర ఖండ్రికలో రైతుకు తోడుగా బరకం కప్పుతున్న సచివాలయ ఉద్యోగులు

సకాలంలో స్పందించారు



వర్ష సూచన ఉన్నప్పటి నుంచీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఉన్నతాధికారుల సూచనలను రైతుల వద్దకు తీసుకెళ్లడంలో ఆర్బీకేలు దోహదపడ్డాయి. ప్రతీ గ్రామంలోనూ ఆర్బీకే ప్రతినిధులు ఉండటంతో వెంటనే స్పందించి రైతుకు అండగా నిలువగలిగారు. వాతావరణ సమాచారాన్ని అందించడం, ధాన్యం కొనుగోలు నియమాలను వివరించడం, విపత్తులొచ్చినప్పుడు సాయమందించడం, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం, పరిహారాన్ని రైతుకు నేరుగా అందేలా కృషి చేయడమనే ప్రతి పనిలోనూ ఆర్బీకే ఉద్యోగులు విశేష కృషి చేస్తున్నారు. – కె.నాగేశ్వరరావు, ఏడీఏ ఆలమూరు, వ్యవసాయ శాఖ

అచ్చమైన స్వచ్ఛంద సేవకులు

వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను ఠంచనుగా అందిస్తూ వారి సంక్షేమాన్ని కాంక్షిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యాన్ని నూరుశాతం నెరవేర్చడానికి గ్రామ/వార్డు వలంటీర్లు (స్వచ్ఛంద సేవకులు) కృషి చేస్తున్నారు. ఒకటో తేదీన వేకువ జామునే ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు లబ్ధిదారుల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నారు. అంతటితో ఆగకుండా గ్రామాంతరంలో ఉన్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి మరీ పింఛన్లు అందజేస్తూ వలంటీర్లు తమ పనికి సార్థకత చేకూరుస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారు, కారణాంతరాలతో బంధువుల ఇళ్లలో ఉన్నవారి వద్దకు దూరాభారం లెక్క చేయకుండా వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

జిల్లా సరిహద్దులు దాటి..


విశాఖలో చికిత్స పొందుతున్న తలుపులయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీరు కృపారాణి

తుని రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన తమరాన తలుపులయ్యకు వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేసి వలంటీరు తమరాన కృపారాణి తన సేవాతత్పరతను చాటుకుంటుంది. పింఛన్ల పంపిణీ గడువు ముగుస్తున్నప్పటికీ ఆస్పత్రి నుంచి స్వగ్రామానికి తలుపులయ్య రాకపోవడంతో వలంటీరు 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించి లబ్ధిదారుడికి పింఛన్ మొత్తాన్ని అందజేసింది. సేవాభావంతో శ్రమకోర్చి దూరాభారాన్ని లెక్కచేయకుండా జిల్లా సరిహద్దులు దాటి వెళ్లి పింఛన్ అందజేసిన కృపారాణిని వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

దూర ప్రాంతానికి వెళ్లి..


శ్రీరంగపట్నం వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీరు దేవి

కిర్లంపూడి: దూర ప్రాంతాలకు వెళ్లినా సకాలంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేయడానికి వలంటీర్లు ఎంతగానో కృషి చేస్తున్నారు. కిర్లంపూడి సచివాలయం-4కు చెందిన పింఛన్‌దారు అడారి రమాదేవికి కాలు విరగడంతో శ్రీరంగపట్నంలో తన సోదరి ఇంటి వద్ద చికిత్స పొందుతోంది. ఇది తెలుసుకున్న వలంటీరు బుద్ద దేవి గురువారం తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేసింది.

కిడ్నీ రోగులకు ప్రభుత్వం భరోసా..


కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నాగేశ్వరరావుకు రూ.పదివేలు పింఛను అందజేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరరావు, నాయకులు

తుని రూరల్: కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం ఎస్సీ కాలనీలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గుల్ల నాగేశ్వరరావుకు మంజూరైన రూ.పదివేల పింఛన్‌ను గురువారం ఆయన అందజేశారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో ఉన్నత అధికారులు రూ.పదివేలు పింఛన్ మంజూరు చేశారన్నారు. మంజూరైన పింఛన్ మొత్తాన్ని ఈ నెల నుంచి విధిగా వలంటీర్ అందిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గారా శ్రీనివాసరావు, కుసనం దొరబాబు, వంగలపూడి జమీలు, వంగలపూడి అప్పారావు, కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

వనములలో విహరించే సత్యదేవుడు

ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన సత్యదేవుడు, అమ్మవారు



సత్యదేవుడు, అమ్మవార్ల వన విహారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు, ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై నిర్వహిస్తున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఐదో రోజు గురువారం సాయంత్రం నవ దంపతులు సత్యదేవుడు, అమ్మవార్లకు కొండదిగువన ఉద్యానవనంలో వన విహారోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3–30 గంటలకు పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా నవ దంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను రత్నగిరి నుంచి ఊరేగింపుగా కొండదిగువన ఉద్యానవనంలోని మంటపం వద్దకు తీసుకువచ్చి అక్కడ వేదికపై ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. తొలుత విఘ్నేశ్వరపూజ అనంతరం పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు సమర్పించారు. పూజలనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమాన్ని వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, చిట్టి శివ, యనమండ్ర శర్మ,ఉపాధ్యాయుల రమేష్, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, అర్చకులు సుధీర్, పవన్ నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో దర్శనం

స్వామివారి వనవిహారోత్సవంలో సత్యదేవుడు, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు తన్మయత్వంతో పరవశించారు. ఏఈఓ తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు శ్రీచక్రస్నానం...నాకబలి, దండియాడింపు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో ఆరో రోజు శుక్రవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు కొండదిగువన పంపా నది వద్ద సత్యదేవుని శ్రీచక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు అనివేటి మంటపంలో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం, శుక్రవారం సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహిస్తారు.

సత్యదేవుని హుండీ రాబడి రూ.1.75 కోట్లు


సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 37 రోజులకు రికార్డు స్థాయిలో రూ.1,74,78,040 ఆదాయం సమకూరింది. దేవస్థానంలో హుండీలను గురువారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దీంతోబాటు బంగారం 280 గ్రాములు, కిలో వెండి వచ్చినట్లు వివరించారు. నగదు 1,68,41,130, చిల్లర నాణేలు 6,36,910 లభించినట్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ధర్మకర్తల మండలి సభ్యులు పేరూరి బద్రీ నారాయణ, ఏసీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి పి.నారాయణమూర్తి, ఎంఎం వీరభద్రరావు, సీహెచ్ ఉదయ్‌బాబునాయుడు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయీ బ్రాహ్మణులు, స్వచ్ఛంద సేవల సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

సీఎం కప్‌లో తూర్పు క్రీడాకారుల ప్రతిభ

పలు విభాగాల్లో పతకాలు కైవసం

నాగమల్లితోట జంక్షన్: తిరుపతిలో మూడు నుంచి ఐదో తేదీ వరకు జరుగుతున్న ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు పలు విభాగాల్లో ప్రతిభను కనపరిచి పతకాలు సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఉమామహేశ్వర్, ధాత్రి, సుబ్రహ్మణ్యం స్వర్ణ పతకాలు, సాత్విక, కె.శ్రీను రజత, మధుచందన, ఇందిర ప్రియాంక, ఆదిత్య, దుర్గారావు కాంస్య పతకాలు అందుకున్నారు. బాక్సింగ్‌లో కె.రాణి రజత, ఎస్‌కే నజీర స్వర్ణ పతకాలు, టెన్నిస్‌లో వీనస్ గ్లోరి ఓపెన్ కేటగిరిలో రజత పతకం సాధించారు. హాకీలో తూర్పు జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు, బాస్కెట్‌బాల్‌లో పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరుకున్నాయని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ గురువారం తెలిపారు.

నేడు సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కాజులూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్థాయిలో శుక్రవారం నిర్వహించే జూనియర్ బాలుర, బాలికల సాఫ్ట్‌బాల్ సెలెక్షన్స్‌కు క్రీడాకారులు హాజరుకావాలని జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.హరికృష్ణ, ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వ తేదీ వరకూ కడప జిల్లా రాయచోటిలో జరుగనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు గత మంగళవారం గొల్లపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌ట్యాంక్ వెనుక ఉన్న క్రీడామైదానంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఒకటో తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురవటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని వాయిదా వేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు దగ్గర పడుతుండటంతో ఎంపికైన క్రీడాకారులు ప్రాక్టీస్‌కి సమయం తక్కువవుతుందనే ఉద్దేశంతో సెలెక్షన్ ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సెలెక్షన్ ప్రారంభమవుతుందని క్రీడాకారులు గంట ముందే క్రీడా మైదానంలో ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 99493 94568, 83099 65048 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరు గ్రామంలో జరిగిన ప్రమాదంలో గాయపడి, కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు ఏలూరు గ్రామానికి చెందిన పేరిచర్ల సూరిబాబు (40) మార్చి 24వ తేదీన తన బైక్‌లో పెట్రోలు అయిపోయిందని, పెట్రోల్ బంక్ నుంచి సీసాలో తెచ్చుకున్న పెట్రోల్‌ను సిగరెట్టు కాలుస్తూ, అజాగ్రత్తగా తన బైక్‌లో పోసుకుంటుండగా అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో ముఖం నుంచి నడుము భాగంగా వరకు శరీరం కాలిపోయింది. తీవ్రంగా గాయపడిన పేరిచర్ల సూరిబాబును కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

యానాం: యానాం దరియాలతిప్ప కేజీ బేసిన్ డి-6 రిలయన్స్ కంపెనీలో ఇనుము దొంగతనం కేసులో పరారీలో ఉన్న నిందితుడు నల్లా రాజును గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. అతడిని సబ్ కోర్టులో హాజరుపరచగా నిందితుడికి 7 రోజుల పాటు రిమాండు విధించారన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు


ఉప్పుటేరులోకి దూసుకెళ్లిన కారు


యువకులను రక్షించిన క్రాంతిని సత్కరిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్ రోడ్డులోని పొన్నాడ శివారు రామన్నపాలెం వంతెన సమీపంలోని ఉప్పుటేరులోకి గురువారం కారు దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన నలుగురు యువకులు కోనపాపపేట వెళుతుండగా ప్రమాదవశాత్తూ రామన్నపాలెం సమీపంలో ఉన్న ఉప్పుటేరులోకి కారు దూసుకెళ్లింది. బీచ్ రోడ్డులో వెళుతున్న కోనపాపపేటకు చెందిన పుక్కాల క్రాంతి, ఆటోడ్రైవర్ మడదా నాగేశ్వరరావు కారు అద్దాలను పగులకొట్టి ఆ యువకులను రక్షించారు. చికిత్స నిమిత్తం వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చి యువకులను రక్షించిన క్రాంతిని సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు శాలువా, పూలమాలతో సత్కరించారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులను నిర్వహించారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి


పాలెపు జగన్ మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు (అంతరచిత్రం) పాలెపు జగన్ (ఫైల్)

కాట్రేనికోన: మండలంలోని పల్లం గ్రామానికి చెందిన పాలెపు జగన్ 14 తండ్రితో పాటు గోదావరి పాయలో చేపల వేటకు వెళ్లగా కాళ్లకు వల చిక్కుకోవడంతో నీటిలో పడిమృతి చెందాడు. బాలుడి తండ్రి పాలెపు సత్యం వేటకు వెళుతుండగా జగన్ తోడుగా వెళ్లాడు. పల్లం వంతెన సమీపంలో గోదావరి పాయలో చేపల వేట చేస్తుండగా బాలుడి కాళ్లకు వల తగిలి నీటిలో మునిగిపోయాడు. బాలుడు నీటిలో మునిగిపోతున్న విషయాన్ని గమనించిన తండ్రి సత్యం కొడుకును రక్షించేందుకు ప్రయత్నం చేశాడు. అయితే గోదావరి పాయ లోతు ఎక్కువ గా ఉండటం, నీటి ప్రవాహం ఉండటంతో బాలుడు దిగువకు కొట్టుకుపోయాడు. బాలుడి తండ్రితో పాటు స్థానికులు వెతకడంతో బాలుడి మృతదేహం దొరికింది. బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగి పోయారు. పల్లం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మామిడికుదురు: బైక్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రాజోలు కోర్టులో హాజరుపర్చగా కోర్టు అతడికి రిమాండు విధించిందని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. చోరీ కేసులో ఆత్రేయపురానికి చెందిన తుపాకుల రామదాసును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. మామిడికుదురు శివారు కంచివారిపాలానికి చెందిన చొల్లంగి నాగేశ్వరరావుకి చెందిన బైక్ ఈ నెల 2వ తేదీన చోరీకి గురైందన్నారు. రోడ్డు పక్కన తన ఫ్యాషన్ ప్లస్ బైక్ పెట్టి పొలం వెళ్లగా చోరీకి గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నిందితుడు తుపాకుల రామదాసును అదుపులోకి తీసుకుని విచారణ జరుపగా చోరీ విషయం వెలుగు చూసిందన్నారు. నిందితుడిపై గతంలో రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో 11 కేసులు నమోదయ్యాయని ఎస్సై బాషా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అంబాజీపేట: కముజువారిలంక శ్రీరామపురం ప్రధాన రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులతో పాటు చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురానికి చెందిన ఎస్.విజయలక్ష్మణ్, ఎ.గల్లా ఉమామహేశ్వరి, ఏడేళ్ల చిన్నారి ఎస్.నవ్యలతో పాటు మరో చిన్నారి కొత్తపేట నుంచి బైక్‌పై అమలాపురం వెళుతున్నారు. శ్రీరామపురం వచ్చే సరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టారు. దాంతో విజయలక్ష్మణ్‌కు, ఉమామహేశ్వరికి, నవ్యలకు తీవ్రగాయాలవగా 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించామన్నారు. నవ్యకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కాకినాడ ఆస్పత్రికి తరలించారన్నారు. ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.